క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలు



చేబ్రోలు: చేబ్రోలు గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులిద్దరు గాయపడ్డారు. పొన్నూరు రూరల్ మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ జానీబీ, కుమారుడు బాషా సత్తెనపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మార్గ మధ్యంలో చేబ్రోలు శివారు వంతెన సమీపంలో ముందు వెళ్తున్న వాహనంలోని గడ్డి మోపులు కిందపడ్డాయి. వెనుకనే వస్తున్న వీరివాహనంపై గడ్డిమోపులు పడటంతో అదుపుతప్పి కింద పడ్డారు. ఈ సంఘటనలో తల్లిజాన్‌బీ, కుమారుడు బాషాకు తీవ్ర గాయాలయ్యాయి.బాషా పరిస్థితి విషమంగా ఉంది. ఇరువురిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అయోధ్య రామ ఉత్సవ్‌-2024



నగరంపాలెం: భరతముని కూచిపూడి నృత్య కళా క్షేత్రం నిర్వహణలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సౌజన్యంతో బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి, అన్నమయ్య కళ్యాణ వేదికలపై నిర్వహిస్తోన్న అయోధ్య రామ ఉత్సవ్‌-2024 రామ్‌లల్లా పురస్కార నృత్యోత్సవం శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన నృత్యోత్సవాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నాట్యాచార్యులు, వందల మంది శిష్యులు రాకతో వేదిక వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆర్‌వీఆర్/జేసీ కళాశాల ఆచార్యులు డాక్టర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాట్యాచారులు, వారి శిష్యులను రెండు వేదికలపై నృత్య ప్రదర్శనలు యిప్పించడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ నాట్యాచారిణి వి.రంగమణి అధ్యక్షత వహించగా, సేవ్ కూచిపూడి వ్యవస్థాపకులు భావన పెద్దప్రోలు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, విద్యావేత్త ఎన్.తిరుపతయ్య, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.షేక్, నాట్యాచారులు ఘంటసాల పవన్ కుమార్, వెంకటేశ్వర్లు, పలువురు నాట్యాచారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాకురాలు రంగమణి దంపతులను సత్కరించగా, గురువులు, చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందించారు.

ఓటువేస్తే ఉచితంగా కంటి పరీక్షలు

పెదకాకాని: ఈ ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకునే పౌరులందరికీ ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహిస్తామని వాసన్ ఐ కేర్ సంస్థ ప్రకటించింది. ఈ నెల 13న ఓటు వేసిన వారు సిరాచుక్క వేసిన వేలిని చూపించినట్లయితే ఉచిత కంటి పరీక్షలు చేపడతామని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. కంటి పరీక్షల అనంతరం చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, అన్ని రకాల బీమా కంపెనీల సదుపాయం వర్తిస్తుందని ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

పొన్నూరు.. ప్రగతి జోరు

- రూ. 397 కోట్లతో పట్టణ అభివృద్ధి.
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 209 కోట్ల సంక్షేమం
- రూ.11 కోట్లతో రోడ్డు విస్తరణ
- రూ.177కోట్లతో రోడ్లు, సైడుకాల్వలు, పలు అభివృద్ధి పనులు



రూ.కోటితో అభివృద్ధి జరిగిన మున్సిపల్ పార్క్



రూ.35 లక్షలతో ఆధునికీకరించిన బస్ డిపో



మెయిన్ డ్రెయిన్ నిర్మాణ పనుల్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య (ఫైల్)

పొన్నూరు : పొన్నూరు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఐదేళ్లలో ఎనలేని మార్పులతో ఆధునికతను సంతరించుకునే దిశగా అడుగులు వేస్తోంది. అభివృద్ధి అంటే ఇది కదా.. అన్నట్టు 2019 నుంచి ఇప్పటిదాకా వార్డులలో మౌలిక వసతులు సమకూరాయి. రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వార్డుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించింది. పట్టణంలో ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను నివృత్తి చేసింది.

రూ. 11 కోట్లతో రోడ్డు విస్తరణ

బాపట్ల, చీరాల, రేపల్లె ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా వున్న పొన్నూరులో దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్య వేధించేది. ఇరుకైన రహదారి, వాహన రాకపోకలతో పాటు ప్రజలు కాలి నడకనవెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2019 అనంతరం ఈ పరిస్థితి దూరమయింది. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా యంత్రాగం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సారథ్యంలో సుమారు రూ. 11 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఆ పనులు శర వేగంగా సాగు తున్నాయి.

రూ. కోటితో పార్కు

పట్టణంలో నిరుపయోగంగా ఉన్న చెరువును రూ. కోటి వ్యయంతో అభివృద్ధి చేసి ఉద్యానవనంగా తీర్చిదిద్దారు. ఆ పార్కుకు మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు పేరుతో నామకరణం చేసి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. 31 వార్డులున్న పట్టణంలో 17 సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. అత్యాధునిక వసతులతో ఆరోగ్య కేంద్రాలు ఆవిర్భవించాయి. పట్టణాభివృద్ధితో పాటు గత 59 నెలల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.209 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసారు. .

నాన్ డీబీటీ వివరాలిలా..

రూ.280 కోట్లతో అభివృద్ధి పనులు, జగనన్న కాలనీలకు రూ.103 కోట్లు, రూ.45 లక్షలతో బస్ డిపో, బస్‌స్టాప్ అభివృద్ధి, విద్యార్థుల ట్యాబ్‌లకు రూ.40 లక్షలు, రూ.2 కోట్లతో గోరుముద్ద, రూ. 4.5 కోట్లతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, రూ. 65 లక్షలతో సచివాలయ నిర్మాణాలు , రూ.6.65 లక్షలతో రోడ్ల అభివృద్ధి, ఇతర అభివృద్ధి పనులకు రూ. 9.04 కోట్లు కేటాయించడం జరిగింది.

పట్టణంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి.

పథకం	లబ్ధిదారులు	జమ చేసిన మొత్తం (లక్షల్లో)
అమ్మ ఒడి	4997	2193.78
జగనన్న విద్యాదీవెన	3407	1518.92
వసతి దీవెన	2687	450.85
రైతు భరోసా	3320	1532.13
సున్నావడ్డీ పంట రుణాలు	979	22.83
క్రాప్ ఇన్సురెన్స్	920	92.80
రైతులకు ఇన్పుట్ సబ్సిడీ	1971	176.77
వైఎస్సార్ పెన్షన్ కానుక	7491	6997.83
చేయూత	2981	1325.44
ఆసరా	8903	2861.39
సున్నావడ్డీ	11091	410.11
కాపునేస్తం	650	282.45
ఈబీసీ నేస్తం	560	150.60
ఆరోగ్యశ్రీ	1611	825.56
హౌసింగ్	2854	1418.58
వైఎస్సార్ భీమా	154	226.70
చేదోడు	493	112.00
జగనన్న తోడు	749	3.22
మొత్తం	69940	209 .01 కోట్లు



పొన్నూరు వీక్షణం



పురపాలక సంఘం పరిధిలో పూర్తయిన జగనన్న ఇల్లు

పట్టణంలో మార్పు కనిపించింది



పొన్నూరు పట్టణ స్వరూపంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. 2019 అనంతరం పట్టణ దశ దిశ మారింది. వార్డుల్లో మౌలిక వసతులు సమకూరాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా కొత్తగా వేసిన రోడ్లు, సైడ్ కాల్వలు కళకళలాడుతున్నాయి.

– బొద్దులూరి రంగారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు

సచివాలయాలతో బాధలు తీరాయి

సర్టిఫికెట్ల కోసం ఐదేళ్ల కిందటివరకు అష్టకష్టాలు పడేవాళ్లం. కానీ ఇప్పుడు మా ప్రాంతంలోనే సచివాలయాల రాకతో ఆ ఇబ్బందులు తప్పాయి. వారాల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన బాధ తప్పింది. వార్డు సచివాలయాల రాకతో సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందుతున్నాయి.

– షేక్. సుభాని. స్థానికుడు

వైఎస్సార్ సీపీతోనే జన సంక్షేమం

పెదకాకాని: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని, సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలంటూ కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ వుయ్యూరు సతీష్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం పెదకాకాని, నంబూరు, వెనిగండ్ల, ఉప్పలపాడు,తక్కెళ్ళపాడు, అగతవరప్పాడు, వెంకటకృష్ణాపురం, కొప్పురావూరు, గోళ్ళమూడి, అనుమర్లపూడి, తంగెళ్ళమూడి గ్రామాల్లో పార్టీ శ్రేణులతో పర్యటించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు అమలు సీఎం జగన్ తోనే సాధ్యమన్నారు.



నంబూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వుయ్యూరు సతీష్‌రెడ్డి, తదితరులు

కార్యక్రమంలో మందాళ శివారెడ్డి, భీమవరపు విజయలక్ష్మి, గ్రామ కన్వీనర్ భీమవరపు కృష్ణారెడ్డి, అన్నపురెడ్డి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): పాతమల్లాయపాలెంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కొందరు నాయకులు వైఎస్సార్ సీపీ బాటపట్టారు. గ్రామ సర్పంచ్ కాసు పద్మావతి రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చాట్ల కోటయ్య, బోలె అంజిబాబుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి చాట్ల ప్రసాద్ బాబుతో పాటు చాట్ల ప్రకాష్, కొల్లూరి జాన్ పాల్, కొల్లూరి నాగయ్య, దర్శాశి సుబ్బారావు, పిల్లి రత్నం, కొల్లరి సురేష్‌బాబు, దర్శాశి కిరణ్‌కుమార్, చాట్ల ఆదిమ్మ పాటు పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బలసాని కిరణ్ కార్యాలయ ప్రతినిధులు జి శ్రీనివాస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన పాతమల్లాయపాలెం టీడీపీ కార్యకర్తలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

వేజండ్ల(చేబ్రోలు): రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందటంతో పాటు మరొకరు గాయపడ్డారు. చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు వద్ద శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వేజండ్ల గ్రామానికి చెందిన పఠాన్ దాదాఖాన్ (78) మరో వ్యక్తితో కలిసి నారాకోడూరు వైపు నుంచి వేజండ్లకు వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన దాదాఖాన్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించాడు. మరో బైక్‌పై ఉన్న రూపేష్‌కు గాయాలవటంతో సమీపంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని పొన్నూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 4,5,28,29, తదితర వార్డుల్లో ఆయన పర్యటించారు. ప్రముఖులను ఆత్మీయంగా పలకరించారు. ఐదో వార్డుకు చెందిన ముస్లిం సీనియర్ నాయకులు షేక్. గఫార్ నివాసంలో వారి కుటుంబసభ్యులును పలకరించారు. టీడీపీ హయాంలో తనకు జరిగిన అన్యాయాన్ని గఫార్ మురళీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. ముస్లింలందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని అంబటి మురళీకృష్ణ అభయమిచ్చారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ముస్లింలు మురళీకష్ణకు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. మార్కెట్ సమీపంలోని జండా చెట్టు వద్ద ఆయన ప్రార్థన చేశారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురు

అనంతరం ఫకీర్లతోపాటు బీజేపీ, మైనార్టీ మోర్చా, శక్తి కేంద్రం అధ్యక్షులు మాటూరి రాఘవ, తాడికొండ కృష్ణమూర్తి, షేక్ బుడే, జి. మధు, పూల సుబ్రహ్మణ్యంతో పాటు వారి అనుచరులు 20 మంది అంబటి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారందరికీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు వడ్రాణం ప్రసాద్, షేక్. నాజర్, షేక్. షరిఫ్ల, షేక్ ఖయ్యూం, వట్టిప్రోలు రంగారావు, మొల్ల కరీం, షేక్ జానీ, షేక్ జాఫర్, షేక్ బాషా, షేక్. సుభాని, నాజర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.



అంబటి మురళీకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన బీజేపీ నేతలు

సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. శనివారం జేకేసీ కళాశాల 56వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ మనిషి సమగ్ర వికాసానికి విద్య దోహదం చేస్తుందన్న స్ఫూహతో ఐదున్నర దశాబ్దాలకు పూర్వమే జాగర్లమూడి కుప్పుస్వామి స్ఫూర్తితో నెలకొల్పిన జేకేసీ కళాశాల ఖ్యాతి విస్తరించటం అభినందనీయమని అన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసానికి దోహదపడే క్రీడలు, పోటీ పరీక్షలపై ఆసక్తి కనబర్చాలన్నారు. తొలుత కళాశాల మూల స్తంభాలైన జాగర్లమూడి చంద్రమౌళి, జాగర్లమూడి నరేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ కళాశాల ఆడిటోరియాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జేకేసీ కళాశాల గత 10 ఏళ్లుగా యూజీసీ ఏ గ్రేడ్ గుర్తింపు పొందుతూ విద్యా ప్రమాణాల స్థాయిని నిలబెడుతోందని అన్నారు.